క్లుప్తంగా

ఉగాది శుభాకాంక్షలు




ఆదిమూలపు సురేష్ బుర్రా మధుసూదన్

సింగరాయకొండ(మర్రిపూడి): నియోజకవర్గ ప్రజలకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ క్రోధినామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఉగాదిని ప్రజలంతా ఆనందోత్సవాలతో జరుపుకోవాలని, నూతన తెలుగు సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

కందుకూరు: నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ సీపీ కందుకూరు అభ్యర్థి, ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఉగాది పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

10న మండల సమావేశం

జరుగుమల్లి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 10వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.జలజాక్షి తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కావాలన్నారు. అజెండాలో తెలిపిన అంశాలపై సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

టంగుటూరు: మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణలో కొండపి ఏరియా కో ఆర్డినేటర్ పి.సునీత సోమవారంచలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీడీఓ సుబ్రమణ్యం, వెలుగు సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

కొండపి(మర్రిపూడి): మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం రాజ్యలక్ష్మి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



కుర్చీలు, బీరువాలు అందజేస్తున్న మేనేజర్ శ్రీనివాసరావు

హనుమంతునిపాడు: దాతలు పాఠశాలలకు, ఆరోగ్య కేంద్రానికి రూ.4 లక్షల విలువైన ఫర్నీచర్ అందజేయడం అభినందనీయమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం జీవీ సురేషబాబు, పీహెచ్‌సీ డాక్టర్ దార్ల సందీప్ అన్నారు. హైదరాబాద్‌కు చెందిన మిడ్‌వెస్ట్ గ్రానైట్ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఫర్నీచర్ అందజేశారు. దాతలను హెచ్ఎం, ఉపాధ్యాయులు, ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు. డాక్టర్ సందీప్, సీహెచ్ఓ కేవీ చెన్నయ్య, హెచ్ఎం సురేష్ బాబు, కస్తూర్బా ఎస్ఓ ఇందిరా సుహాషిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలభైరవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కాలభైరవస్వామి

జరుగుమల్లి: మండల పరిధిలోని కె.బిట్రగుంటలో ప్రసిద్ధి గాంచిన కాలభైరవస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా విశేష పూజలు చేశారు. అభిషేకాల అనంతరం కాలభైరవస్వామిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. పలువురు భక్తులు హోమాలు నిర్వహించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అన్నదాన ఉభయకర్తలు తన్నీరు మాల్యాద్రి, పోలమ్మ నిర్వహించారు. దేవస్థానం ఇన్‌చార్జి బి.ఆంజనేయులు వచ్చిన భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు జాళ్లపాలెం తిరునాళ్ల

కొండపి(మర్రిపూడి): ఉగాదిని పురస్కరించుకొని జాళ్లపాలెంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ల వైభవంగా నిర్వహించనున్నట్లు ఈఓ కొండారెడ్డి తెలిపారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ కమిటీ, పోలీసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు.

జోష్..!



ఆత్మీయ సమావేశంలో వేదికపై చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, దద్దాల నారాయణ యాదవ్, బుర్రా మధుసూదన్ యాదవ్, కదిరి బాబురావు, చింతల చెరువు సత్యన్నారాయణరెడ్డి, నేతలు (ఫైల్)



కనిగిరి బస్సు యాత్రలో హాజరైన ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి (ఫైల్)

- జగనన్న రాకతో కనిగిరి కార్యకర్తల్లో మరింత ఉత్సాహం
- కనిగిరిలో ఫ్యాను గాలికి సైకిల్ అయినట్లే..

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనతో కనిగిరి నియోజకవర్గంలోని పార్టీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. మేమంతా సిద్ధం బస్సు యాత్ర రోడ్ షో కనిగిరి నియోజకవర్గంలోని రెండు మండలాల్లో సుమారు 15 గ్రామాల్లో సాగింది. తమ అభిమాన నేత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని చూసేందుకు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. అనుకున్న సమయం కంటే రెండున్నర గంటలు ఆలస్యంగా వచ్చినా.. మండుటెండను సైతం లెక్క చేయకుండా పార్టీ కార్యకర్తలు, అభిమానుల నిలుచున్నారు. జగనన్న ఆత్మీయ పలకరింపుతో పులకరించిపోయారు. అడుగడుగునా పూల వర్షం కురిపించారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలతో జగనన్న చేసిన పలకరింపులు వారిలో మరింత ఆనందాన్ని నింపాయి. ఇక పార్టీ క్యాడర్‌లో మరింత ఉత్సాహం నెలకొంది.

'కనిగిరిలో సైకిల్'

వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్‌ల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఆత్మీయ సమావేశాలు జరిగాయి. ఆ సమావేశాల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో పాటు కనిగిరి ఎమ్మెల్యే, కందుకూరు నియోజకవర్గ సమన్వయకర్త బుర్రా మధుసూదన్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో ఉన్న పార్టీ నేతలంతా ఒకే వేదికపై కన్పించడంతో పార్టీలోనే క్షేత్ర స్థాయిలో నుంచి క్యాడర్ మరింత ఉత్సాహం నింపుకుంది. బుర్రా మధుసూదన్ యాదవ్, కదిరి బాబురావు, చింతల చెరువు సత్యన్నారాయణరెడ్డి, నేతలంతా ఒక్కటే నినాదంతో పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులంతా సమష్టిగా ఐక్యమత్యంగా పనిచేసి కనిగిరి కొండపై మళ్లీ వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసి వైస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. తమ అభిమాన నాయకులంతా ఇచ్చిన పిలుపుతో నియోజకవర్గంలోని పార్టీ క్యాడర్‌లో మరింత జోష్ నింపుకుంది. ఆత్మీయ సమావేశాలకు హాజరైన కార్యకర్తలు.. జగనన్న బస్సు యాత్రలకు స్వచ్ఛందంగా తరలివచ్చిన అభిమానం గణం చూసిన కనిగిరి ప్రజలు ఇక కనిగిరిలో సైకిల్‌ అయినట్లేనంటూ జోరుగా ప్రచారం సాగుతోంది.

నారాయణస్వామి ఆదాయం రూ.1.42 లక్షలు



చైర్మన్, ఈఓలకు విరాళం అందజేస్తున్న దాతలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రు.1,41,716 ఆదాయం వచ్చినట్లు ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ సోమవారం తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.47,660, లడ్డుప్రసాదాల అమ్మకంద్వారా రూ.22,990, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.27,318, మహాప్రాకార నిర్మాణానికి రూ.29,232, శాశ్వత పూజలకు రూ.5,516, ఇతర విరాళాలు రూ.9 వేలు ఆదాయం వచ్చినట్లు ఈఓ, చైర్మన్‌లు తెలిపారు. మహాప్రాకార నిర్మాణానికి మండలకేంద్రమైన పామూరుకు చెందిన దగ్గుల శ్రీనివాసరెడ్డి, శ్రీమతి కల్పనలు రు.25,116 విరాళంగా అందజేశారన్నారు. కొమ్మినేని వెంకట్రావు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

నేడు పంచాంగ శ్రవణం

పామూరు: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం సందర్భంగా పామూరు మదన వేణుగోపాలస్వామి దేవస్థానంలో మంగళవారం ఉదయం 8 గంటలకు పంచాంగశ్రవణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు తెలిపారు.

మీలో ఒకడిని.. ఆశీర్వదించండి



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దద్దాల నారాయణ యాదవ్



పాల్గొన్న చైన్నైలో నివాసముంటున్న కనిగిరి వాసులు

- వైఎస్సార్ సీపీ కనిగిరి అభ్యర్థి దద్దాల నారాయణ
- జగనన్న పాలనలోనే పేదలకు పెద్దపీట

కనిగిరి రూరల్: సంక్షేమ పథకాలు సుదీర్ఘ కాలం కొనసాగాలంటే.. మనమంతా సైనికుల్లా పనిచేద్దాం .. జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుందాం.. అని వైఎస్సార్ సీపీ కనిగిరి అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. చెన్నైలో నివసిస్తున్న కనిగిరి నియోజకవర్గ ప్రజల ఆత్మీయ సమ్మేళనం సోమవారం రాత్రి తమిళనాడులోని సోలింగ నెల్లూరులోని కైలాస గార్డెన్లో పులిరామ చంద్రారెడ్డి, కటికల వెంకట రత్నం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ నేను మీలో ఒకడిని, సామాన్యుడిని.. బీసీ వర్గానికి చెందిన నన్ను ఆశీర్వదించండి.. అన్ని వేళలా అందుబాటులో ఉండి సేవకుడిలా పనిచేస్తానన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సముచిత స్థానం దక్కిందన్నారు. పేదలకు పెద్ద పీట వేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేనని కొనియడారు. చెన్నై ప్రాంతంలో నివసించే కనిగిరి నియోజకవర్గ వాసులంతా వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. నెల రోజుల్లో జరిగే సార్వత్రిక ఎన్నికలకు కుటుంబ సమేతంగా కనిగిరికి వచ్చి ఫ్యాను గుర్తుకు ఓటేసి, వేయించి తనను ఎమ్మెల్యేగా, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. తొలుత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తమిళనాడు సేవాదళ్ అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, ఏఎంసీ చైర్మన్ చింతం గుంట్ల సాల్మన్ రాజు, ఎంపీపీలు దంతులూరి ప్రకాశం, అత్యాల జఫన్య, కేవీ రత్నం, గంగసాని హుస్సేన్‌రెడ్డి, మూడమంచు వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీల సంఘ అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీలు కస్తూరిరెడ్డి, ఓకేరెడ్డి, చప్పిడి వెంకట సుబ్బయ్య, మేకల శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ రామన తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ గాయం బలరాంరెడ్డి, వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్ రెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఒమేగా రామిరెడ్డి, ఎస్‌కే బుజ్జీ, వైస్ ఎంపీపీలు దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, భూమిరెడ్డి వెంకటరెడ్డి, సర్పంచ్‌లు ముత్యాల నారాయణరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, కొండ ప్రతాప్‌రెడ్డి, పులి మాల్యాద్రి, పాలకొల్లు మల్లికార్జున్‌రెడ్డి, దుగ్గిరెడ్డి జయరెడ్డి, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు మాబు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఇతర నేతలు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



బ్రహ్మయ్యచౌదరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బుర్రా

కందుకూరు: వైఎస్సార్ సీపీలోకి రోజు రోజుకు పెరుగుతున్నాయి. లింగసముద్రం మండలం చీమలపెంట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మణికొండ బ్రహ్మయ్య చౌదరి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. సోమవారం స్థానిక కార్యాలయంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. బ్రహ్మయ్యచౌదరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్యచౌదరి మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్న పాలనకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. అనంతరం బుర్రా మాట్లాడుతూ పార్టీలోకి కొత్తగా వచ్చే వారికి తగిన ప్రాధాన్యం ఇస్తామని, అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు. క్షేత్ర స్థాయిలో కష్టపడి పనిచేసి వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.తిరుపతిరెడ్డి, ఎంపీపీ పెన్నా క్రిష్ణయ్య, నాయకులు రూబేను, జక్రయ్య, మోజెస్, ఏసేబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్‌విందు సందర్భంగా దువాలో పాల్గొన్న నాయకులు, ముస్లింలు

పామూరు: పవిత్ర రంజాన్ సందర్భంగా పామూరులోని నాలుగు మసీదుల పరిధిలో ఉపవాసం ఉంటున్న ముస్లిం సోదరులకు సోమవారం రాత్రి స్థానిక విరువూరురోడ్డులో వైఎస్సార్ సీపీ యూత్ మండల అధ్యక్షుడు యాదాల వెంకట సాయికిరణ్ ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశాడు. ఈ సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్.చాంద్‌బాషా, కోఆప్షన్ నాయబ్‌రసూల్, ఇర్రి వెంకట కృష్ణారెడ్డి, షేక్.షంషూర్, షేక్.హాజీగౌస్, షేక్.గయాజ్, సత్యంరెడ్డి, మంచికంటి మధు, కొత్తూరి రవి, దరిశి సుబ్రహ్మణ్యం, పి.సూరి, గాజులపల్లి శ్రీనివాసరెడ్డి, ఆంజనేయులు, శ్రీరాములు, చింతం బాలిరెడ్డి, షేక్.సలీం, పోలు గురవారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి జగన్‌తోనే సాధ్యం



పాజర్లలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న లక్ష్మీనారాయణ

గుడ్లూరు: సంక్షేమ పాలన, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని కందుకూరు అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ కుమారుడు లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని పాజర్లలో సోమవారం రాత్రి వైఎస్సార్ సీపీ నాయకులతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లలో నవరత్నాల పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరిస్తూ ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. సర్పంచ్ పాటి వెంకటేశ్వర్లు, ఎంపీపీ పులి రమేష్, ఎంపీటీసీ రాజ్యలక్ష్మి, బిళ్లా రమణయ్య, గనిపినేని వెంకటేశ్వర్లు, టి.రమేష్, రామూర్తి, సోమయ్య, అశోక్, జేసీఎస్ మండల కన్వీనర్ కిషోర్ పాల్గొన్నారు.

పాస్టర్స్ కమిటీ ఎన్నిక

కందుకూరు రూరల్: నియోజకవర్గ పాస్టర్స్ కమిటీని కందుకూరులోని ఏబీఎం కాంపౌండ్‌లో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాస్టర్స్ కమిటీ ప్రెసిడెంట్‌గా గద్దె ధనరాజ్ (కందుకూరు), వైస్ ప్రెసిడెంట్‌గా పి.సుభాష్ పాల్ (గుడ్లూరు), సెక్కటరీగా కె.గిరిరమేష్ (ఉలవపాడు), జాయింట్ సెక్రటరీగా కె.ఆల్బర్ట్ చంద్రన్‌పాల్ (లింగసముద్రం), ట్రెజరర్‌గా డి.యాకోబు (వలేటివారిపాలెం), ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా కె.శ్యామ్యూల్ (కందుకూరు), పి.అనీల్ (పోకూరు), జి.జార్జి (కొండముడుసుపాలెం), జి.జాషువా (వలేటివారిపాలెం), కె.రవీంద్రబాబు (ఉలవపాడు), ఏ.ఏసురత్నం (లింగసముద్రం), పి.వేదనాయకం (గుడ్లూరు), అడ్వయిజర్స్‌గా డి.అహరోను (వలేటివారిపాలెం), ఏ.కాలేబు (ఉలవపాడు), ఎన్.సుందరరావు (లింగసముద్రం), పి.జనార్ధన్ (కందుకూరు), జి.జాన్ (గుడ్లూరు)లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు పి.సుజయ్ అధ్యక్షత వహించారు.

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి



లింగసముద్రంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

లింగసముద్రం: రానున్న ఎన్నికల్లో ప్రతి పౌరుడు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని గుడ్లూరు సీఐ బీవీవీ సుబ్బారావు అన్నారు. లింగసముద్రం, మొగిలిచర్ల, వీఆర్‌కోట గ్రామాల్లో ఎస్సై ఎం.బాజీబాబుతో కలిసి కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు ముందుస్తుగా కేంద్రబలగాలతో కవాతు నిర్వహిస్తున్నామని చెప్పారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రామిరెడ్డి



సాంస్కృతిక కార్యక్రమాల్లో డాన్స్‌చేస్తున్న విద్యార్థులు

పామూరు: విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ విద్యాభ్యాసం సాగించాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, వివేకా విద్యాసంస్థల సీపీ కల్లూరి రామిరెడ్డి అన్నారు. స్థానిక వివేకా ఉన్నతపాఠశాల వార్షికోత్సవ కార్యక్రమం సోమవారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకోసం ఇష్టంతో కష్టపడి చదవాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రోత్సహించాలన్నారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధపోటీల్లో రాణించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. విద్యాసంస్థల కార్యదర్శి బండి బాస్కర్‌రావు, డైరెక్టర్లు బైరెడ్డి జయరామిరెడ్డి, బైరెడ్డి వెంగళరెడ్డి, హెచ్ఎం బండి లక్ష్మి, డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ ఎం మహాలక్ష్మయ్య, మునగల రామసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనధికార అమ్మకాలు చట్ట విరుద్ధం



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: పొగాకు అనధికార అమ్మకాలు చట్ట విరుద్ధమని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. కోల్డ్ స్టోరేజీల్లో బేళ్లు ఉన్న రైతులు లెక్కలు తెలియజేయాలని, బోర్డు అనుమతి తీసుకొని వేలం కేంద్రానికి తీసుకురావాలని కోరారు. వేలం కేంద్రానికి తీసుకువచ్చేటప్పుడు అన్య పదార్థాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. సోమవారం మల్లవరప్పాడు, శివపురం, గార్లమిట్ట, మట్టిపాడు గ్రామాలకు చెందిన రైతులు 904 బేళ్లను తీసుకురాగా 817 బేళ్లను కొనుగోలు చేసి 87 బేళ్ల తిరస్కరించారు. గరిష్ట ధర రూ.236, కనిష్ట ధర రూ.220, సరాసరి రూ.229.04 పలికింది.వేలంలో32మందివ్యాపారులు పాల్గొన్నారు.

కొండపి(మర్రిపూడి): స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో సోమవారం జరిగిన వేలంలో పొగాకు అత్యధిక ధర రూ.237 పలికింది. వ్యాపారులు జువ్విగుంట, అయ్యవారిపాలెం, తంగెళ్ల, జాళ్లపాలెం, పీరాపురం గ్రామాలకు చెందిన రైతులు 959 బేళ్లను వేలానికి తీసుకురాగా 786 బేళ్లను కొనుగోలు చేయగా 173 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.237, కనిష్ట ధర రూ.220 పలికింది. వేలంలో 22 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు.

34 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ఉలవపాడు: అక్రమంగా తరలివెళుతున్న 34 బస్తాల రేషన్ బియ్యాన్ని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. తనిఖీలలో భాగంగా ఉలవపాడు ఎస్సై బాజీరెడ్డి తన సిబ్బంది తో కలసి వాహనాలు పరిశీలిస్తున్న సమయంలో రాజుపాలెం జంక్షన్ వద్ద వాహనంలో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వాటిని పరిశీలించి 34 బస్తాల రేషన్ బియ్యం కందుకూరు నుంచి కావలికి తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనాన్ని, బియ్యం తరలిస్తున్న వ్యక్తిని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పీడీఎస్ బియ్యం ఎక్కడ నుంచి వచ్చాయో తెలుసుకుని పూర్తి స్థాయి విచారణ చేసి చట్టపర చర్యలు తీసుకుంటామన్నారు.